కెవిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - కడప అర్బన్

2024 - 25 విద్యా సంవత్సరానికి కేంద్రియ విద్యాలయంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ప్లస్ వన్)కు ఈనెల 4 నుంచి 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని కేంద్రియ విద్యాలయ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. ఉమేష్ బాబు, ఉపాధ్యక్షులు వై. మల్లిఖార్జున రెడ్డి, కోశాధికారి యల్. జితేంద్ర ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సింగపూర్ టౌన్ షిప్ పక్కన ఉన్న కేంద్రియ విద్యాలయలో రిజిస్ట్రేషన్ చేసుకొవచ్చుని పేర్కొన్నారు. సిబిఎస్ఇ, స్టేట్ బోర్డు, ఐసిఎస్ఇ, ఎన్ఐఒఎస్ సిలబస్‌లో పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంగ్లీష్ మాధ్యమంలో సైన్స్, మ్యాథ్స్ గ్రూపులున్నాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. కెవిఎస్ఎఎన్‌జిఎటిఎఎన్. ఎన్ఐసి.ఐ ఎన్ వెబ్ సైట్ చూడాలని తెలిపారు.

నేడే కౌంటింగ్

కౌంటింగ్‌కు సిద్ధమైన అన్నమయ్య జిల్లా ఎన్నికల లెక్కింపు కేంద్రం

కౌంటింగ్‌కు సిద్ధమైన వైఎస్ఆర్ కడప జిల్లా ఎన్నికల లెక్కింపు కేంద్రం

- కడప, రాయచోటి కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- పటిష్ట బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు
- ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్‌కు 14 టేబుళ్లు
- తొలుత పోస్టల్ బ్యాలెట్ గణన
- తొలి ఫలితం కమలాపురానిదే

సార్వత్రిక ఎన్నికల ఫలితాల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. కడప, అన్నమయ్య జిల్లా కేంద్రాల్లోని మౌలానా అబుల్ కలామ్ ఉర్దూ పాలిటెక్నిక్ కళాశాల, శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆయా జిల్లాల అధికార యంత్రాంగాలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆయా జిల్లాల కలెక్టర్లు సుశిక్షితులైన సిబ్బందితో ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు జిల్లాలకు చెందిన ఎస్పీలు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా పకడ్బందీ బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. రౌండ్ల వారీ లెక్కింపు అవకాశాలను పరిశీలిస్తే తొలి ఫలితం కమలాపురం, తుది ఫలితం జమ్మలమడుగు స్థానాలకు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి

కడప, అన్నమయ్య జిల్లాలోని రెండు పార్లమెంట్, 13 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. కడప జిల్లాలో 16,39,066 ఓటర్లు ఉన్నారు. కడప పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. పార్లమెంట్ స్థానానికి ఇదేవిధంగా టేబుల్స్ ఏర్పాటు చేశారు. కౌంటింగ్‌కు సూపర్ వైజర్లు, అసిస్టెంట్లు, మైక్రోఅబ్జర్వర్లు, ఇతర సిబ్బందితో కలిసి 911 మందిని నియమించారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ముందుగా తొలి అర్థగంటపాటు 22,645 అసెంబ్లీ, 22,635 పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టనున్నారు. అనంతరం పోలైన ఓట్లను లెక్కింపు ప్రారంభం కానుంది. కమలాపురం అసెంబ్లీ స్థానానికి 18 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్న నేపథ్యంలో తొలి ఫలితంగా వచ్చే అవకాశం కనిపిస్తోంది. జమ్మలమడుగు అసెంబ్లీ స్థానానికి 23 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. ఈలెక్కన జమ్మలమడుగు ఆఖరున ఫలితం వెలువడే అవకాశం కనిపిస్తోంది. మిగిలిన ఐదు అసెంబ్లీ స్థానాలు 20 రౌండ్లలో లెక్కించనున్న నేపథ్యంలో మధ్యస్థంగా ఫలితాలు వెల్లడి కావచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జమ్మలమడుగు ఫలితం తరహాలోనే పార్లమెంట్ ఫలితమూ ఆలస్యం వెల్లడి కానున్నట్లు తెలుస్తోంది.

అన్నమయ్య జిల్లాలో ఆరు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలోని 14,26,834 మంది ఓటర్లలో 14,1115 ఓటింగులో పాల్గొన్నారు. ఈలెక్కన 77.85 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా కేంద్రంలోని శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఆరింటి అసెంబ్లీ స్థానాలకు రెండేసి కౌంటింగ్ కేంద్రాల చొప్పున 12 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో అసెంబ్లీ స్థానానికి 14 టేబుళ్ల చొప్పున ఆరింట్లో 168 టేబుళ్లను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ 1033 మంది సిబ్బందిని నియమించారు. జిల్లాలోని రాజంపేట పార్లమెంట్ స్థానానికి 21,490 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. వీటి లెక్కింపునకు 20 టేబుళ్లను ఏర్పాటు చేశారు. ముందుగా తొలి అర్థగంట సమయం పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. అనంతరం సాధారణ ఓట్లను లెక్కింపు ప్రారంభమవుతుంది. కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లడానికి సుమారు 600 మీటర్ల దూరంలో వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసింది. అధికార వైసిపి, కూటమి పార్టీలకు, కౌంటింగ్ సిబ్బంది, మీడియా సిబ్బందికి వేర్వేరుగా ఏర్పాటు చేసింది. జిల్లా పోలీస్ యంత్రాంగం కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేసింది. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. బాణాసంచా కాల్చడం, మద్యం అమ్మకాలను నిషేధించింది. ఏజెంట్లు ఏవిధంగా వ్యవహ రించాలనే అంశాలపై ముందుగానే శిక్షణ ఇచ్చారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య కౌంటింగ్ నిర్వహిం చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

టెన్షన్..టెన్షన్..

కౌంటింగ్ సమయం దగ్గర పడుతున్నకొద్దీ అభ్యర్థుల్లో టెన్షన్ ..టెన్షన్ వాతావరణం నెలకొంది. ఫలితం ఎలా ఉంటుందోననే ఉత్కంఠ రాజ్యమేలుతోంది. ఎగ్జిట్‌పోల్స్‌లో మిశ్రమ స్పందన కనిపించ డంతో ఎవరు ఎదురు పడినా ఫలితంపై చర్చించుకోవడం కనిపి స్తోంది. బెట్టింగురాయుళ్ల పందేల జోరు అడ్డూఅదుపూ లేకుండా సాగిపోతోంది. జిల్లాలోని ఆయా గ్రామాల వారీగా మెజార్టీ ఎవరికి, బూత్‌ల వారీగా, మండలాల వారీగా అంచనాలు వేసుకుంటున్న పరి స్థితి కనిపిస్తోంది.

కడప నగర శివారులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న అన్నమయ్య జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్

దేవాదాయ శాఖ

ఎసిపై ఫిర్యాదుల పరంపర

- జిల్లా అధికారులకు సిపిఎం వినతి
- అవినీతి ఆరోపణలపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి - కడప సిటీ

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. ఇటీవల ఎసి ఆధ్వర్యంలో కడప నగరంలోని పాత బస్టాండులోని సిపిఎం జిల్లా కార్యాలయం కూల్చివేతకు విఫలయత్నం చేశారు. కార్యాలయం కూల్చివేత ప్రయత్నాన్ని సిపిఎం నాయకత్వం అడ్డుకున్న సంగతి తెలిసిందే. జిల్లాలో ఎన్నికల కోడ్, 144 సెక్షన్, 30 యాక్ట్ వంటి చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ లా అండ్ ఆర్డర్‌ను జిల్లా అధికారే ప్రశ్నార్థకం చేసేలా వ్యవహరించడం దారుణమని, ఇటువంటి వివాదాస్పద అధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసింది. సిపిఎం జిల్లా కమిటీ ఫిర్యాదు చేయడంతో జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు, ప్రజాసంఘాల నుంచి అసిస్టెంట్ కమిషనర్ తీరుపై విమర్శల వర్షం కురుస్తోంది. పదేళ్లుగా జిల్లాలోనే తిష్ట వేసుకుని కూర్చుకుని ప్రొద్దుటూరు శివాలయం మొదలుకుని ప్రొద్దుటూరులోని గీతాశ్రమం, గోశాల, బ్రహ్మం గారిమఠం, రాజంపేట తదితర ప్రాంతాల్లో ఆయన పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తుతుండడం గమనార్హం. సుమారు దశాబ్దానికిపైగా జిల్లాలోనే ఉండడంలోని మతలబేమిటో తెలియడం లేదనే విమర్శ వినిపిస్తోంది. సాధారణంగా మూడేళ్ళ, ఐదేళ్ల వ్యవధిలో ప్రభుత్వ అధికారులు బదిలీలు కావడం సహజం. కానీ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పదేళ్లకుపైగా జిల్లాలో ఉండడంలోని ఆంతర్యమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. దశాబ్దానికిపైగా జిల్లాలోనే పాతకుపోయిన నేపథ్యంలో ఆయన రాజకీయ నాయకుల దగ్గర నుంచి డిపార్టుమెంట్ వరకు ఎవరూ ప్రవర్తించే అవకాశం లేకుండా చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఆయన పరపతి ముంగిట దేవాదాయ శాఖ అధికారులు నిలబడలేని పరిస్థితి నెలకొందనే విమర్శలు ఉన్నాయి. ఇంతటి స్థాయిలో రాజకీయ, అధికారుల అండదండలు ఉండ బట్టే శాంతిభద్రతలను సైతం ఉల్లంఘించే సాహసానికి ఒడిగట్టారనే వాదన వినిపిస్తోంది. ఎన్నికలకోడ్, 144 సెక్షన్, 30 యాక్ట్ అమల్లో ఉండగానే ఒక ఉద్యమ రాజకీయ పార్టీ కార్యాలయంపై బరితెగింపుతో రావ డంలోని మతలబేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. ఇంతటి స్థాయిలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్న వివాదాస్పద అధికారిపై తక్షణమే శాఖాపరమైన విచారణకు ఆదేశించాలనే డిమాండ్లు వెల్లువెత్తున్నాయి.

దేవాదాయ శాఖ ఎసిపై విచారణ చేపట్టాలి

దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సాగించిన అవినీతి ఆరోపణలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. పదేళ్లకు పైగా కడప జిల్లాలోనే ఉండడం వల్లే ఇంతటి స్థాయిలో ఆరోప ణలు వస్తున్నాయి. ఇంతటి స్థాయిలో అవినీతి ఆరోపణలు ఉన్న అధికారిని చూడలేదు. ఈయనపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం.

- బి.మనోహర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, కడప.

బద్వేల్ : మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

శంకర్ బాలాజీని సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి-బద్వేల్

అవినీతికి పాల్పడుతున్న ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీని సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, మహిళా సంఘం పట్టణ నాయకులు మోక్షమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ప్రజా సంఘాల సమావేశం సిఐటియు పట్టణ కో-కన్వీనర్ బి.సి. కొండయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దేవాదాయ శాఖ ఆలయాలు సంబ ంధించి నిష్పక్షపాతంగా అభివద్ధి చేయడం లేదని తెలిపారు. దేవాదాయ స్థలాలను కాంప్లెక్స్‌లను అనుకూలమైన వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. లాభాపేక్షతో కమర్షియల్ స్థలాలను చేసుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడని పేర్కొన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అట్లూరు మండల కార్యదర్శి ఇ. రమణయ్య. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చంద్‌బాష, నాయకులు. పుల్లయ్య, రామమోహన్, షరీఫ్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** శంకర్‌బాలాజీ చేసిన ఆవినీతి ఆరోపణల దృష్ట్యా వెంటనే తగిన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శంకర్‌బాలాజీ దాదాపు 11 ఏళ్ల పదవీలో కొనసాగుతూ రూ.కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఆయన అవినీతి భాగోతం తారాస్థాయికి చేరుకుందని వాపోయారు. అక్రమార్జనకు పాల్పడ్డారన్నారు. రాజంపేటకు సంబంటధించి 2 ఎకరాలు ఎండోమెంట్ భూమిని అమ్మిన సమయంలో అధికారులు ఛార్జ్‌మెమో జారీ చేశారని గుర్తు చేశారు. ప్రొద్దు టూరులో ఆవుల పశుగ్రాసం కోసం అక్రమంగా రూ.లక్షలు డ్రా చేశారన్నారు. అక్కడ పశువుల లేకున్నా వాటి పేరు చెప్పి అక్రమార్జన చేశారన్నారు. షెడ్డు లేకున్నప్పటికీ షెడ్డు నిర్మాణానికి అని రూ.లక్షలు దిగమింగారని షెడ్డు విషయం చర్చనీయాంశం కావడంతో పది రోజుల కిందట షెడ్డు నిర్మించారన్నారు. ఆశ్రమంలో ఒక క్లర్కు ఉంటే అతని ద్వారా పని జరుగుతుందని అలాంటిది ఆరుగురు క్లర్కులను నియమించారన్నారు. బ్రహ్మం గారిమఠంలో రూ.25 లక్షల హుండీ డబ్బులు, అరకిలో బంగారం శంకర్‌బాలాజీ మాయం చేశారని అక్కడున్నవారు ప్రొద్దుటూరు, కడపలో కారు వినియోగించినట్లు చెప్పి రూ.14 లక్షలు కారు అద్దె దిగమింగారన్నారు. ప్రొద్దుటూరు గీతాశ్రమం అద్దెలకు సంబం ధించి దాదాపు రూ. 8 కోట్ల మేర స్వాహా చేశారని తెలిపారు. అవినీతితో ఆర్జించిన సొమ్మును రికవరీ చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనా కార్యక్రమాలు చేస్తామని సత్యనారాయణ హెచ్చరించారు. సమావేశంలో ఆటోయూనియన్ నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధం

- ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ్ రామరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

వైఎస్ఆర్ జిల్లాలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ ప్రక్రియను సజావుగా, సమ్మిళితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాలుగా భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసిందని జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ విసి హాలులో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ సన్నద్ధతపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన వాతావరణాన్ని నిర్ధారించేందుకు కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామని చెప్పారు. 308 మంది మైక్రో అబ్జర్వర్‌లను నియమించామని తెలిపారు. అవసరమైన మేరకు 120శాతం నియామకం చేపట్టామని పేర్కొన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ 603 మందిని కౌంటింగ్ సిబ్బందిగా, కౌంటింగ్ అసిస్టెంట్‌లుగా అవసరమైన 120 శాతం మేరా నియామకం చేపట్టామని చెప్పారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, ఎఆర్‌ఒలతో సహా కౌంటింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. మైక్రో అబ్జర్వర్‌లకు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉదయం 8.00 గంటలకు ప్రారంభమవుతుందని ఇవిఎంల కౌంటింగ్ ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ మాట్లాడుతూ కౌంటింగ్ ఏజెంట్లను ఉదయం 7 గంటల తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ లోనికి అనుమతించరని పేర్కొన్నారు. పోలీసుల తనిఖీలు ఉంటాయి కాబట్టి ఏజెంట్లు అభ్యర్థులు సమయానికంటే రెండు గంటల ముందే వస్తే మంచిదన్నారు. అలాగే కౌంటింగ్ పూర్తయ్యే వరకు కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వెళ్లడానికి అనుమతి లేదని చెప్పారు. రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద పోటీ చేసే అభ్యర్థి లేదా ఎన్నికల ఏజెంట్‌ను ఒకేసారి అనుమతించారని తెలిపారు. కౌంటింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా వారికి కేటాయించిన టేబుల్‌ల వద్దే ఉండాలని, కౌంటింగ్ హాల్‌లో తిరగడానికి అనుమతిలేదన్నారు. మొబైల్ ఫోన్లు ఎలక్షన్ కమిషన్ అనుమతించిన సిబ్బందికి మినహా కౌంటింగ్ హాలులో నిషేధించబడిందని చెప్పారు. కడప, ప్రొద్దుటూరులో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు స్టాండర్డ్ 2 కి బదులు 3 టేబుల్స్ ఉన్నాయని తెలిపారు. జమ్మలమడుగు అత్యధిక రౌండ్లు (23 రౌండ్లు), కమలాపురం అత్యల్ప రౌండ్లు (18 రౌండ్లు) ఉంటాయని పేర్కొన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇవిఎం లెక్కింపు కోసం 14 టేబుల్స్ ఉంటాయని చెప్పారు. కడప పీసీలో పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం 14 టేబుల్స్ ఉన్నాయని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రత్యేక హాలులో 4 రౌండ్లలో జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ ఫలితాలు మధ్యాహ్నం 3.00 గంటలకు, పార్లమెంటరీ నియోజకవర్గ ఫలితాలు దాదాపు సాయంత్రం 4.00 గంటలకు పూర్తవ్వొచ్చు అన్నారు. జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీ ఏజెంట్లకు కౌంటింగ్ హాల్‌లో ప్రాధాన్యతతో సీటింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. కౌంటింగ్ హాలులో వైద్య, అగ్నిమాపక బృందాలతో సహా అవసరమైన అన్ని ఏర్పాట్లు సంసిద్ధం చేశామని తెలిపారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాతున్న కలెక్టర్, ఎస్‌పి

'హమారే బారా'ను నిషేధించండి

కడప అర్బన్ : అత్యంత పరమ పవిత్రమైన ఖురాన్‌కు వ్యతిరేకంగా నిర్మించిన 'హం దో - హమారే బారా' హిందీ సినిమాను వెంటనే నిషేధించాలని వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు కోరారు. సోమవారం డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇస్లాం సంప్ర దాయం, సంస్కృతి ముస్లిములు, ముస్లిం మహిళల నిబద్ధత, వారి వ్యక్తిగత జీవితాలను వక్రీకరిస్తూ అన్ను కపూర్ అనే దర్శక నిర్మాత సదరు హిందీ సినిమాను నిర్మించి ముస్లిముల మనోభావాలను తీవ్రంగా గాయపరిచినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్ర ఖురాన్‌లోని సూర బకరాను వక్రీకరిస్తూ ట్రైలర్ విడుదల చేశారని ఆరో పించారు. ఇందులో ఇస్లాం, ఖురాన్‌కు వ్యతిరేకంగా చూపించారని విమర్శి ంచారు. ముస్లిం మహిళలను కించపరుస్తూ, ఇస్లాం సంప్రదాయాన్ని అవహేళన చేస్తూ ఇష్టం వచ్చిన రీతిన ఆర్ఎస్ఎస్ భావజాలంతో సదరు చిత్రాన్ని నిర్మించారని ఆరోపించారు. అందువల్ల భారతీయ సినిమాటోగ్రఫీ చట్టం కింద ఈ సినిమాను నిషేధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నేత నజీర్ అహ్మద్, ప్రముఖ సంఘ సేవకుడు సలావుద్దీన్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, జెఎసి జిల్లా కన్వీనర్ బాబు భాయ్, కడప వైద్యుల సంఘం ప్రతినిధి డాక్టర్ నాజిముద్దీన్, మత గురువు లు జాకీర్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, మిల్లి కౌన్సిల్ ప్రతినిధి నయీమ్, తాహిర్ పాల్గొన్నారు.

డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేస్తున్న ముస్లిమ్ నేతలు

కడపపై ఏడు వికెట్ల తేడాతో
కర్నూలు జట్టు విజయం

కడప : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ మెన్స్ వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంటులో భాగంగా సోమవారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప జట్టుపై ఏడు వికెట్ల తేడాతో కర్నూలు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 43.3 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని టి. వంశీకృష్ణ 36 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని కమారుద్దీన్ 3, ఇస్మాయిల్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 137 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 27.3 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసి ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని సాయి సూర్య తేజ 72 పరుగులు చేశాడు. **నెల్లూరుపై అనంతపురం జట్టు విజయం**..జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ మెన్స్ వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై ఒక వికెట్ తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 34.1 ఓవర్లలో 195 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని మాధవ్ 70 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని కామిల్ మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 196 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 33.3 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసి ఒక వికెట్ తేడాతో విజయం సాధించింది. ఆ జట్టులోని గిరినాథ్ రెడ్డి 100 పరుగులు (సెంచరీ) చేశాడు.

చెస్ టోర్నమెంట్‌లో అమీనా ప్రతిభ

కడప : గుంటూరులోని చలపతి ఫార్మసిటికల్ కళాశాలలో నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఓపెన్ చేస్ టోర్నమెంట్‌లో కడప నగరానికి చెందిన చిన్నారి అమీనా అండర్-9 బాలికల విభాగంలో మూడవ స్థానం సాధించింది. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ, కార్యదర్శి సుమన్ చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంది. అనీస్ దర్బారి 5 పాయింట్లు, ప్రణవి 4 పాయింట్లు, లాస్య ప్రియ 3 పాయింట్లు, హరీష్ 3 పాయింట్లు, నీలేష్ 2 పాయింట్లు, నందన రెండు పాయింట్లు సాధించినారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మండలంలో ఎండిపోతున్న అరటి, ఆకు తోటలు, చీనీ నిమ్మ రైతులను ఆదుకోవాలని మండల హార్టికల్చర్ అధికారి ప్రశాంతికి ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తీవ్ర వర్షాభావం, ఎండల తీవ్రతతో బోరు బావులు అడుగంటి పోవడంతో అరటి, చీని నిమ్మ, ఆకు తోటలను తక్షణమే ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన తెలిపారు. తాము మండలంలోని లింగారెడ్డిపల్లి కొలుముల పల్లె పంచాయతీలోని పంట పొలాలను పరిశీలించామని చెప్పారు. ఈ సంవత్సరం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఒకపక్క, మరోపక్క ఎండ తీవ్రతతో బోరు బావులు అడుగంటి పోవడంతో రైతులు వేసిన పంటలు అరటి ఆకుతోటలు చీని నిమ్మ పంటలు కోత దశలో నీటి తడులు అందక నిట్ట నిలువునా ఎండిపోతున్నాయని ఆయన తెలిపారు. అరటి ఆకు తోటలకు సాగు పెట్టుబడి ఖర్చులు ఎకరాకు లక్ష రూపాయలు పైగా ఖర్చు వస్తుందని ఈ తరుణంలో బోరు బావులు భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో లేత దశలోనే పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. కౌలు రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉందని ఎకరాకు కౌలు రూ. 50 వేలు పైగా పెట్టి సాగు చేస్తున్నారని ఆయన అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో పంటలు నష్టపోయిన రైతులను కలుపుకొని ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడతామని ఆయన హెచ్చరించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని పోయి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, మండల నాయకులు రంగారెడ్డి,చిన్న సిద్దయ్య ఓబుల రెడ్డి పాల్గొన్నారు.

'అన్నమాచార్య' అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

స్థానిక అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) మెకానికల్ ఇంజినీరింగ్ విబాగాధిపతి మురళీమోహన్ నాయక్‌కు అనంతపురం జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వారు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి తెలిపారు, మురళీమోహన్ నాయక్‌కు కెఎస్ఆర్ఎమ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మూర్తి పర్యవేక్షణలో 'పర్ఫామెన్స్, ఆగుమెంటేషన్ ఆఫ్ కంబైన్డ్ సైకిల్ పవర్ ప్లాంట్ విత్ ఇన్ లెట్ ఎయిర్ కూలింగ్ వెపర్ అజార్షన్ రిఫ్రిజిరేషన్ సిస్టమ్' అనే అంశం పైన పరిశోధన చేసినందుకు డాక్టరేట్ లభించింది. ఆయన్ను ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డితోపాటు అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

బడి పిల్లలను కార్మికులుగా మార్చొద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్

బడి ఈడు పిల్లలను షాపుల్లో, కర్మాగారాల్లో కూలీలుగా, కార్మికులుగా పనిలో పెట్టుకోవద్దని లేబర్ ఆఫీసర్స్ పాల్ జాన్సన్, మునుస్వామి, లీగల్ ప్రొబిషన్ ఆఫీసర్ సునీత పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఏడు రోడ్ల కూడలి పరిసర వీధుల్లో, షాపులను, మెకానిక్ షెడ్లను పరిశీలించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. బడిలో ఉండాల్సిన పిల్లలు పనిలో ఉండటం నేరమని, అలా పనిలో ఉంచుకున్న యజమానులపై చర్యలు తప్పవని తెలిపారు.ప్రతి షాపు యజమాని తమ షాపులో బాల కార్మికులు లేరని స్టిక్కర్ అంటించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రత్యామ్నాయ పాఠశాలల అధికారి విశ్వనాధ్ రెడ్డి, సెక్టోరల్ అధికారులు కేశవరెడ్డి, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

కడప అర్బన్ : రోడ్డు భద్రత అందరి బాధ్యత అని సివి రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం కడప జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించారు. రోడ్డు నియమాలు, రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల గురించి రూపొందించిన ఛాయాచిత్ర పోస్టర్లను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ జీవితంలో భద్రతా నియమాలు సక్రమంగా అవలంభించి సుఖ ప్రయాణ జీవితాన్ని గడపాలని తెలిపారు. రోడ్డు భద్రత అందరికీ బాధ్యతని, రోడ్డు నియమాలు తెలుసుకుని రోడ్లపై అడ్డంకులు సృష్టించకుండా, పరిమితవేగంతోను, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్ వంటి వి చేయకాదన్నారు. రోడ్డు భద్రత విషయాలు తెలుసుకోవాలని ఎర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. అమీరుద్దీన్ విద్యార్థుల చేత రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేయించారు.

పిడుగుపాటుకు తాటిచెట్టు దగ్ధం

- భయాందోళనల్లో ప్రజలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

తాటి చెట్టుపై పిడుగు పడడంతో పిడుగు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పులివెందుల నియోజకవర్గంలోని తొండూరు మండలం అగూడూరు గ్రామం పంట పొలాలలో ఆదివారం రాత్రి పిడుగు పడింది. పిడుగు జన సంచారంలో కాకుండా పొలంలోని ఓ తాటి చెట్టుపై పడడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఆదివారం రాత్రి మెరుపులు, ఉరుములు వస్తుండడంతో ఇంటి నుంచి బయటకు రావడానికి ఆ ప్రాంత ప్రజలు హడలిపోయారు. చుటుపక్కల గ్రామాల సోమవారం ఉదయం పంట పొలాలలోని ఓ తాటి చెట్టుపై పిడుగు పడిందని సమాచారం తెలియడంతో ప్రజలంతా హమ్మయ్యా అనుకున్నారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

పాత బస్టాండ్‌లో మోహరించిన పోలీసులు

భారీగా పోలీసులు మోహరింపు

- పట్టణంలో దుకాణాలు బంద్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మంగళవారం ఓట్ల లెక్కింపు కారణంగా సోమవారం మధ్యాహ్నాం మూడు నుంచి పట్టణంలో పూర్తిగా కర్ఫ్యూ విధించారు. కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాలు, పార్టీ కార్యాలయాల్లో డిఎస్‌పి టిడి యస్వంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు. 400 మంది పోలీసులు, క్యూ ఆర్ టీమ్‌లు, మొబైల్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నారు.

సుంకేసుల ఎస్‌సి కాలనీలో అన్నదానం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సుంకేసుల ఎస్‌సి కాలనీలో ఆంజనేయ స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐ ఎపి మస్తాన్

మైదుకూరు పోలీసులకు ఎస్‌పి అభినందనలు

రెండు గంటల్లోనే కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - మైదుకూరు

ఈ నెల 2న ఆదివారం సాయంత్రం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మండలంలోని జివి సత్రం గ్రామానికి చెందిన అవిరేని సంతోష్ అనే వ్యక్తిని కిడ్నాప్ చేశారు. దీనికి సంబంధించి అర్బన్ సిఐ ఎపి మస్తాన్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. కిడ్నాప్ అనంతరం నిందితులు సంతోష్ అన్న శివకు ఫోన్ చేసి మీ తమ్ముడు మా వద్ద నుంచి వీసా ఇప్పిస్తామని దాదాపు రూ.3 లక్షలు డబ్బు తీసుకున్నాడు.. ఆ డబ్బు మాకు పంపితేకానీ మీ తమ్ముడ్ని వదలమని బెదిరించారన్నారు. దీనిపై సంతోష్ తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మైదుకూరు డిఎస్‌పి వెంకటేశులు ఆధ్వర్యంలో అర్బన్ సిఐ మస్తాన్, ఎస్‌ఐ రాజరాజేశ్వర రెడ్డి, దువ్వూరు ఎస్‌ఐ శ్రీనివాసులు తమ సిబ్బందితో 10మంది నిందితులను దువ్వూరు బైపాస్ రోడ్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద నేషనల్ హైవేపై అరెస్టు చేశామన్నారు. సంతోష్‌ను క్షేమంగా అతని తండ్రికి అప్పగించామన్నారు. కిడ్నాప్‌నకు ఉపయోగిం చినమహీంద్రా బొలెరో వాహనం, 10 మొబైల్ ఫోన్స్‌ని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. నిందితులు ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన వారిగా గుర్తించామన్నారు. నిందితుల్లో దుర్గారెడ్డి, వెంకటేశ్వర్లు, మరో 8 మందిని అరెస్టు చేశామన్నారు.

ఎస్‌పి అభినందన : ఫిర్యాదు అందిన వెంటనే మైదుకూరు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, కేవలం రెండు గంటల్లోనే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కిడ్నాప్ కేసును ఛేదించి, కిడ్నాపర్ల బారినుండి బాధితుడిని కాపాడి, వారిని అరెస్టు చేసినందుకు ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ మైదుకూరు డిఎస్‌పి వెంకటేశు, మైదుకూరు, అర్బన్ సిఐ మస్తాన్, మైదుకూరు అర్బన్ ఎస్‌ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి, దువ్వూరు ఎస్‌ఐ శ్రీనివాసులు, సిబ్బందిని అభినందించ్చారు.

ఇసి నిబంధనలు పాటించని పెట్రోల్ బంక్ సీజ్

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని బుడ్డాయపల్లె సమీపంలో కడప-కర్నూల్ జాతీయ రహదారిపై ఉన్న భారత్ పెట్రోల్ బంక్‌ను సోమవారం సీజ్ చేసినట్లు సిఐ రామాంజులు తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలు పాటించకుండా లూజు విక్రయాలు చేస్తున్నారన్న సమాచారంతో పరిశీలించామన్నారు. అది నిజమని తేలడంతో మేనేజర్ నవీన్ సమక్షంలో పెట్రోల్ బంక్‌ను సీజ్ చేసినట్లు సిఐ పేర్కొన్నారు.

పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న సిఐ రామాంజులు

తిప్పిరెడ్డిపల్లెలోకి వర్షపు నీరు

ప్రజాశక్తి - మైదుకూరు

ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షాలకు మండలంలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ప్రకాశ్‌నగర్ జలమయమైంది. కొత్తపల్లి ఫారెస్ట్ బీట్ నుండి భారీ వర్షం పడడంతో వర్షం నీరు గ్రామంలోకి వచ్చింది. ప్రకాశనగర్ ఇళ్లల్లోకి భారీగా వరద నీరు చేరింది. ధాన్యం, ఇతర వస్తువులు ఆ నీటిలో తడిచిపోయాయి. పంట పొలాలలోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు, అధికారులు జెసిబి యంత్రం ద్వారా నీటిని మళ్లించారు. ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు నష్టం జరిగిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కొండ చుట్టూ తీసిన ట్రెంచ్ బలహీనంగా ఉండి తెగిపోవడంతో వర్షపు నీరు గ్రామంలోకి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జెసిబి యంత్రంతో నీటిని మళ్లిస్తున్న ప్రజలు

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి - మైదుకూరు

పోలీసు అధికారులు, పోలీసులు నిరంతరం అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశించారు. మంగళవారం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో సోమవారం ఆయన మైదుకూరు డిఎస్‌పి కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ట్రబుల్ మాంగర్స్ పట్ల కఠినంగా వ్యవహారించాలన్నారు. 144 నిషేధాజ్ఞలు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో మైదుకూరు డిఎస్‌పి వెంకటేశులు, అర్బన్ సిఐ మస్తాన్, రూరల్ సిఐ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

దుకాణాలు మూసేసి సహకరించాలి

వేంపల్లె : ఎన్నికల కౌటింగ్ సందర్భంగా మంగళవారం వేంపల్లెలోని వ్యాపారులు అందరూ దుకాణాలన్ని మూసేసి ప్రశాంత వాతావరణానికి సహకరించాలని సిఐ చాంద్‌బాషా కోరారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల కౌటింగ్ సందర్భంగా వేంపల్లెలో 144 సెక్షన్, 30 యాక్టు అమలు చేస్తున్నట్లు చెప్పారు. అవసరం ఉంటే తప్ప ఎవరూ కూడా రోడ్లపైకి రావద్దని సూచించారు. రోడ్లపై గుంపులుగా తిరగరాదని తెలిపారు. పోలీసు నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిం చారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రజలు రోడ్లపై తిరగరా దన్నారు. ఆయా పార్టీల నాయకులు బాణసంచా పేల్చరాదని తెలిపారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఈనెల 6వ తేదీ వరకు ర్యాలీలు, బాణసంచా కాల్చడం నిషేధమన్నారు. వాహనాల సెలెన్సనర్లను తీసి శబ్ద కాలుష్యం చేయరాదని తెలిపారు. రెచ్చగొట్టే ప్రకటనలు చేయవద్దని సూచిం చారు. రాజకీయ నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

క్రీడాస్ఫూర్తితో మెలగాలి

జమ్మలమడుగు రూరల్ : మంగళవారం ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు గెలుపోటములను క్రీడాస్ఫూర్తిగా తీసుకుని మెలగాలని పలువురు సూచిస్తున్నారు. 2024 సాధారణ ఎన్నికల దృష్ట్యా మంగళవారం కడపలో పార్లమెంట్, అసెంబ్లీ ఓట్లను లెక్కించనున్నారు. పోటీ చేసిన అభ్యర్థుల భవితవ్యం ప్రజలు తమ ఓటుద్వారా బాక్స్‌ల్లో నిక్షిప్తం చేశారు. ప్రజల తీర్పు మంగళవారం వెలువడనుంది. ఈ సందర్భంగా ఎలాంటి కవ్వింపు చర్యలు, ఘర్షణ వాతావరణం సృష్టించకుండా ప్రశాంతంగా ఉండాలని కోరుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నుంచి పోలింగ్ రోజు, ఆ తర్వాత కౌంటింగ్, మళ్లీ రెండు రోజులు శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం పోలీసులు పాటుపడుతున్నారు. ఓట్ల లెక్కింపు రోజు ప్రజలు గుమికూడితే ఏదో సందర్భంలో మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుంటుందని పేర్కొంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసుల నిబంధనలు పాటించాల్సి ఉంది.

యువత.. ఆలోచించు జీవితం చాలా విలువైంది

జీవితం చాలా విలువైనది.. ఆలోచించాలి. ఓట్ల లెక్కింపు రోజు ముఖ్యంగా యువత సంయమనం పాటించాలి. ఎలాంటి ఆవేశాలకు లోనుకావొద్దు. **- వీరణాల శివకుమార్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి**

ఘర్షణలకు పాల్పడి జైలుపాలు కావొద్దు

క్షణికావేశానికి గురై కుటుంబంలోని భార్య, పిల్లలను, తల్లిదండ్రులను, బంధువులను దూరం చేసుకోవద్దు. రాజకీయాలను ఓటింగ్ వరకే పరిమితం చేయాలి. అనంతరం ప్రజాశ్రేయస్సు కోసం దృష్టి సారించాలి. ఘర్షణలకు వెళ్లి జైలు పాలు కావద్దు. ప్రశాంతంగా ఉండాలని కోరుతున్నాను. **- యస్వంత్, డిఎస్‌పి**

గొడవలు సృష్టిస్తే చర్యలు

బ్రహ్మంగారిమఠం : సార్వత్రిక ఎన్నికల అనంతరం మంగళవారం ఓట్ల లెక్కింపు సందర్భంగా అందరూ ప్రశాంతంగా ఉండాలని ఎస్ఐ విద్యాసాగర్ కోరారు. సోమవారం మఠం సెంటర్‌లో ఎస్ఐ విద్యాసాగర్ మాట్లాడుతూ సెక్షన్ 144, 30యాక్ట్ అమలులో ఉందన్నారు. గుంపులుగా ఉంటూ కనపడకూడదన్నారు. ఎమర్జెన్సీ అవసరాలకు తప్ప ఇంటి నుండి బయటకు రాకూడదన్నారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, గొడవలు సృష్టించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ విద్యాసాగర్ హెచ్చరించారు.

ముద్దనూరులో పోలీసుల కవాతు

ముద్దనూరు : ఎన్నికల కౌంటింగ్ రోజు మంగళవారం అల్లర్లు సృష్టించి గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ దస్తగిరి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి పాత బస్టాండ్, నాలుగు రోడ్ల కూడలి వరకు సిఐ ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. మైదుకూరు డిఎస్‌పి శ్రీనివాసరావు కవాతు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ప్రజలు గుంపులుగా ఉండకూడదన్నారు. ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచా పేల్చడం నిషేధించినట్లు తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ కార్యాలయాలు, ఫంక్షన్ హాల్‌ల్లో ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేసి జన సమీరణ చేయరాదన్నారు. నాయకులు, ప్రజలు, కార్యకర్తలు సంయమనం పాటించి, సహకరించాలని సిఐ కోరారు.

కవాతును పరిశీలిస్తున్న మైదుకూరు డిఎస్‌పి

అన్నిరకాల వైద్య సేవలను నమోదు చేయాలి

సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి వి.మల్లేష్

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి అన్నవరం ఆరోగ్య ఉప కేంద్రంలో సోమవారం 104 సంచార వైద్య శిబిరాన్ని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ వి.మల్లేష్ తనిఖీ చేశారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో 104 సంచార వైద్య శిబిరాన్ని ఆయన తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. రికార్డ్స్, రిజిష్టర్లు పరిశీలించారు. ఉన్న మందులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో మందులను, రిజిష్టర్లను తనిఖీ చేశారు. హెల్త్ వెల్నెస్ సెంటర్‌కు వచ్చిన రోగులతో అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది రికార్డ్స్ తనిఖీ చేశారు. ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో అన్ని రకాల సేవలను అంతర్జాలంలో నమోదు చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు వేయాలన్నారు. అన్ని రకాల వైద్య సేవలు 100శాతం ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, యంఎల్‌హెచ్‌పి శృతి, ఎఎన్ఎం మెరీనా, 104 సిబ్బంది సిద్దయ్య, మల్లికార్జున, ఆశా కార్యకర్తలు భారతి, శిల్ప, రామసుబ్బమ్మ, మాధవి, నరసమ్మ, రోగులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

సింహాద్రిపురం : స్కానింగ్ సెంటర్‌లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని కోరుకుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ప్రత్యూష తెలిపారు. మండలంలోని కోరుకుంటపల్లె పిహెచ్‌సిలో సోమవారం లింగ వివక్షతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడ, మగ పిల్లలపై ఎలాంటి వివక్షత చూపరాదన్నారు. సమాజంలో మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలు రాణిస్తున్నారని తెలిపారు. లింగ నిర్ధారణ చేయించుకోవడం కూడా నేరమన్నారు. డిప్యూటీ డెమో రమణమ్మ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది గర్భిణులు సాధారణ కాన్పులు పట్ల అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ ఖాదరవల్లి, సూపర్వైజర్ ఓబులేసు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యురాలు ప్రత్యూష

రిటైర్డ్ టీచర్ సుబ్బయ్య మృతదేహానికి పలువురు నివాళులు

ప్రజాశక్తి - వేంపల్లె

రిటైర్డ్ టీచర్ బాలం సుబ్బయ్య (85) మృతదేహానికి పలువురు నివాళులర్పించారు. స్థానిక బలిజ వీధిలో నివాసం ఉంటున్న ఓ దినపత్రికా విలేకరి మనోహర్ తండ్రి బాలం సుబ్బయ్య కడప ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని వేంపల్లెకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, సర్పంచ్ రాచినేని శ్రీనివాసులుతోపాటు పలువురు నివాళులర్పించారు. మనోహర్‌కు ధైర్యం చెప్పారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు బాలం సుబ్బరాయుడు, ఉత్తన్న, వేమా నాగరాజా ఉన్నారు.

IN THE COURT OF THE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: KADAPA

O.S. No. 531/2022

Md.Ghouse Mohiddin rep.by its General Power of Attorney Holder by name Md.YasmeenBegum. ...Plaintiff

V/s

K.B.M.Setty, S/o K.Subramanyam, aged 72 years, Hindu, R/a.D.No.4/445, Bapuji Road, Aravindha Nagar, Kadapa City, YSR Kadapa District. Andhra Pradesh. ...Defendant

సమను - నోటీసులు

పై కేసులో మీ పైన పర్మనెంటు ఇంజక్షన్ కోరుచు దావాదారుడు O.S.No.531/2022 వేసి టెంపరరీ ఇంజక్షన్ I.A.No. 544/2022 కోరుచు దావా వేసి సమన్లు, నోటీసులు పంపగా తీసుకొననందున మీరు పై కోర్టులో 19.06.2024వ తేదీన ఉదయం 10.30గంటలకు హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న ఎడల తెల్పుకోవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

//By Court Order//

S.MASTHAN VALLI, M.Com., L.L.B.,
Advocate & Notary,
Kadapa.

IN THE COURT OF THE 3rd ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: KADAPA

O.S. No. 771/2022

B.P.Ramanaiah. ...Plaintiff

V/s

Govindu Eswaraiah, S/o Pedda Venkataiah, aged 50 years, Hindu, R/a D.No.2/418-1-9, Akkayapalli, Kadapa City, YSR Kadapa District. ...Defendant

SUMMON-NOTICE

దావాదారుడు, పిటిషనరు మీ పైన దావా పర్మనెంటు ఇంజక్షన్ కోరుచు I.A.No.778/2022లో టెంపరరీ ఇంజక్షన్ కోరుచు దావా O.S.No.771/22 వేసి సమను, నోటీసులు పంపగా మీరు తీసుకొననందున మీరు పై కోర్టులో 19.06.2024వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై ఏమైనా ఆక్షేపణలు వున్న ఎడల తెల్పుకోవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

//By Court Order//

S.MASTHAN VALLI, M.Com., L.L.B.,
Advocate & Notary,
Kadapa.

పాటిమీదపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మురుగు నీరు నిల్వలేకుండా చూడాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున మురుగు నీరు ఎక్కడా నిలువ లేకుండా చర్యలు చర్యలు చేపట్టాలని స్థానిక వైద్యాధికారి ముబీన్ ఆదేశించా. ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర రావులపల్లి సచివాలయం పరిధిలోని పాటిమీదపల్లి గ్రామంలో సోమవారం ప్రపంచ మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మలేరియా రహిత సమాజం, ప్రపంచవ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధనకు మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేద్దామన్నారు. వర్షాలు వచ్చినప్పుడు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు గుడ్లు పెట్టి తమ సంతానాన్ని ఉత్పత్తి చేస్తాయని తెలిపారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్య, ఫైలేరియా, మెదడు వాపు, కాలాజర్ వ్యాధులు వస్తాయన్నారు. దోమకాటు చాలా ప్రమాదమని వివరించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం, సబ్ యూనిట్ ఆఫీసర్ బి.నరసింహారెడ్డి, సూపర్‌వైజర్ శోభన్‌బాబు, హెల్త్ అసిస్టెంట్ యం.విజయభాస్కర్, ఆరోగ్య కార్యకర్త బి.సుజాత, ఆశా కార్యకర్తలు పి.ఆరోగ్య మేరీ, ప్రజలు పాల్గొన్నారు.

720 క్వింటాళ్ల జనుములు మంజూరు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట ఎరువు సాగులో భాగంగా 720 క్వింటాళ్ల జనుములు మంజూరయ్యాయని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. వీటి ధర కిలో రూ.88 కాగా, 50 శాతం సబ్సిడీతో రైతులకు రూ.44కు అందజేస్తామన్నారు. కావలసిన రైతులు ఆధార్‌కార్డు, భూమి పాసుపుస్తకం, సెల్‌ఫోన్ నెంబర్‌తో సంబంధిత రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. విఎఎల వద్ద రిజిష్టర్ చేయించుకోవాలన్నారు. అనంతరం రైతులకు విత్తనాలు అందజేస్తామన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ శంకర్‌రెడ్డి

మైనర్లు ప్రమాదం చేస్తే తల్లిదండ్రులదే బాధ్యత

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలో సోమవారం అర్బన్ సిఐ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మైనర్ల చేతికి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని పేర్కొన్నారు. మైనర్లు పొరపాటున వాహనాన్ని ఢీకొట్టి ఏదైనా ప్రమాదం జరిగితే తగిన మూల్యం తల్లిదండ్రులు చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించవద్దని సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం ఓట్ల లెక్కింపు ఉన్నందున పోలీసులు పులివెందుల పట్టణంలో నలుమూలలా ముమ్మరంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆయా రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద కూడా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కొత్తవారు ఎవరూ మంగళవారం పట్టణంలోకి రాకూడదని సిఐ తెలిపారు.

మహిళాభివృద్ధితోనే సమసమాజం సాధ్యం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమసమాజం సాధ్యమని జనవిజ్ఞానవేదిక (జెవివి) రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మురళీధర్ పేర్కొన్నారు. స్థానిక జెవివి కార్యాలయంలో సోమవారం వేసవి శిబిరాలు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పనుల్లో ఆడ,మగ అనే తేడా లేకుండా అన్ని రకాల పనులను అందరూ చేసే సంస్కృతి సమాజంలో రావాలన్నారు. పిల్లలు ఇష్టంగా చదివితేనే విజ్ఞానం అందుతుందన్నారు. ఆటలు చదువులో భాగంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్ మంచిచెడు రెంటికీ ఉపయోగపడుతుందన్నారు. దీన్ని మన అభివృద్ధి కోసమే వినియోగించుకోవాలన్నారు. ఆహార పానీయాల విషయంలో కూడా మంచిచెడులు ఆలోచించాలన్నారు. ఫాస్ట్‌ఫుడ్ అనారోగ్యహేతువులన్నారు. రసాయనాలు వినియోగించే కూల్‌డ్రింక్స్‌ను వాడకూడదన్నారు. సహజ సిద్ధమైన శీతల పానీయాలు వినియోగించాలన్నారు. ఐస్‌క్రీము, ఫాస్ట్‌ఫుడ్, కూల్‌డ్రింక్ వల్ల పిల్లలకు ఊబకాయం వస్తుందన్నారు. పాఠ్యపుస్తకాలతోపాటు సమాజంలో జరిగే విషయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కథల పుస్తకాలను చదివి మళ్లీ చెప్పడం ప్రాక్టీస్ చేస్తే ఊహాశక్తి పెరుగుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా అధ్యక్షులు పోలంకి శ్రీరాములు, పట్టణ ఉపాధ్యక్షులు వి.రాజశేఖర్, పబ్లికేషన్స్ కన్వీనర్ రాజశేఖర్, కో-ఆర్డినేటర్లు తేజ, హాసిని, అక్షయ, భరత్, జునైద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మురళీధర్

PUBLIC NOTICE
ANDHRA PRADESH BRAHMIN CO-OPERATIVE CREDIT SOCIETY LTD
REGD. No. ABC-CS/006/2015
H.O. : ABCCS, Endowment Commissionerate Campus, Gollapudi, Vijayawada -521225, Ph. 0866-6650307
B.O.: ABCCS, No.5/270,Brahmin Street,Kadapa – 516001, Ph.0877-222666

ఈ ప్రకటనలోనివారి తాలూకు ఈ దిగువ ఉదహరించిన స్థిరాస్తులకు సొసైటీ నందుతనఖా పెట్టి సొసైటీ నుంచి ఇంటి తనఖా అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్తుల తనఖా పై సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోపు లిఖితపూర్వకంగా అభ్యంతరములను రిజిస్టర్డు పోస్టు విత్ అక్నాలెడ్జ్మెంట్ ద్వారా సొసైటికి తెలియపరచవలసిందిగా కోరుతున్నాము.

వ. నెం	పేరు	స్థిరాస్తి వివరములు
1	Sri Varanasi Venkata Ramana VaraPrasad, GL No:4338, W/o Varanasi RamaDasaiah, MobileNo:9490006856/ 9666551855/ 9640039099	The property an Extent of 241.11 Sq.Yds of house site along within RCC roofed Commercial ground Floor building with 7 Rooms therein, at RS No.275-2B,Door Nos: 6-103A,6-103B,6-103C,6-103D,6-103E,6-103F&6-103G with respective Tax Asst Nos:11784,11785,11786,11787,11788,11789 &11790,RevenueWard No:1,Sri Ramadasaiah Colony,Kalasapadu(GP & M),YSR Kadapa(D)-516217,Value-Rs.50.42 Lakhs

KADAPA
03.06.2024

సం/- ఎ.జ్యోత్స్న
మేనేజర్
Mobile No-9281029470/7013443371